సాక్షి అనకాపల్లి

మంగళవారం । 12 । మార్చి । 2024



అర్జీల పరిష్కారం వేగవంతం

స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. సోమవారం 246 దరఖాస్తులు నమోదయ్యాయి. 8లో



ఏయూలో విదేశీ ఆచార్యుడు

విశాఖ: ఏయూను అమెరికాలోని ఫ్లోరిడా వర్సిటీ ఆచార్యుడు జ్ఞాన భాస్కర్ సందర్శించారు. గణిత విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6.09	4.54
నర్సీపట్నం	6.13	4.52

న్యూస్‌రీల్

'ఆనందపురం-అనకాపల్లి' హైవే జాతికి అంకితం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



అనకాపల్లి-ఆనందపురం ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి

సాక్షి, అనకాపల్లి: 'ఆనందపురం-సబ్బవరం-అనకాపల్లి' జాతీయ రహదారిని సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.29,395 కోట్ల విలువైన పలు జాతీయ రహదారులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.2,013 కోట్లతో 50.8 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఆనందపురం-అనకాపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కూడా ఉంది. ఎన్‌హెచ్-16 ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంతో విశాఖపట్నానికి ట్రాఫిక్ సమస్యలు తొలగాయి. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు రోడ్డుకు మధ్యలో 32 వేలకు పైగా మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడేవిధంగా ఈ రహదారిని నిర్మించారు. దాదాపు ఏడాది నుంచి జాతీయ రహదారి మీదుగా రాకపోకలు జరుగుతున్నాయి. అనకాపల్లి-సబ్బవరం-ఆనందపురం జాతీయ రహదారిని లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని మోదీకి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

తుమ్మపాల: బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం చదువుతున్న విద్యార్థులకు జపనీస్ భాష నేర్పించి జపాన్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఏవీఐఎస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి జపాన్ దేశంలో పనిచేయడానికి ఉపాధి కల్పిస్తామన్నారు. గ్రాడ్యుయేట్, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఏఎన్ఎం, జీఎన్ఎం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులన్నారు. 20 సంవత్సరాల నుంచి 32 మధ్య వయస్సు ఉండాలన్నారు. ఆరు నెలలపాటు శిక్షణ ఉంటుందని, వసతి, ఇతర సదుపాయాల ఖర్చులో ప్రభుత్వం 50 శాతం భరిస్తుందన్నారు. జీతం రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకు ఉంటుందన్నారు. జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి కావాల్సిన సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. www.apssdc.in.home.onlineprogramregistration ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99086 29287 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బహుముఖం చిత్రం తొలి గీతం విడుదల




హర్షివ్ కార్తీక్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

మాకవరపాలెం: త్వరలో విడుదల కానున్న బహుముఖం చలనచిత్రంలోని మొదటి గీతాన్ని స్థానిక అవంతి కళాశాలలో విడుదల చేశారు. గాజువాకకు చెందిన హర్షివ్ కార్తీక్ అవంతి కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఆయన దర్శక నిర్మాతగా, కథానాయకుడిగా తెరకెక్కనున్న బహుముఖం చిత్రం తొలి గీతాన్ని సోమవారం సాయంత్రం కళాశాలలోని అధ్యాపకుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ ఈ నెల చివరిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులతో తన తొలి చిత్రంలోని గీతాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం హర్షివ్ కార్తీక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ప్లేస్‌మెంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఈసీఈ విభాగాధిపతి గోవింద, ఏవో డానియల్‌రాజ్ పాల్గొన్నారు.

పొత్తులు.. కత్తులు

అనకాపల్లిలో అయోమయం..

- 'టీడీపీ-జనసేన' విస్తృత స్థాయి సమావేశానికి దాడి, పరుచూరి డుమ్మా
- కొణతాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కేడర్ దూరం
- దాడి వీరభద్రరావు సమావేశానికి వస్తున్నట్లు విస్తృత ప్రచారం
- మూడు రోజుల క్రితమే సయోధ్య కుదిరినట్లు ప్రచారం
- దాడి వర్గీయుల గైర్హాజరుతో రేగుతున్న దుమారం



సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ-జనసేన పొత్తు పాట్లు తారస్థాయికి చేరుకున్నాయి. సోమవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన ×టీడీపీ-జనసేన¶ పార్టీల విస్తృత స్థాయి ఉమ్మడి సమావేశానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కర్‌రావు డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు దాడి రత్నాకర్, వారి వర్గీయులు ఈ సమావేశానికి హాజరవుతారని విస్తృత ప్రచారం చేశారు. సమావేశం చివరి వరకూ అందరూ ఎదురుచూశారు. కానీ వారెవరూ రాలేదు. వీరికి తోడుగా జనసేన నేత పరుచూరి భాస్కర్‌రావు, ఆయన వర్గీయులు కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు. కేవలం 150 నుంచి 200 మందితోనే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరగడం, జనసేన, టీడీపీ కేడర్ రాకపోవడంతో కొణతాల రామకృష్ణ వర్గీయులు డీలా పడ్డారు.

కొణతాల మదిలో ఓటమి భయం

టీడీపీ-జనసేన పార్టీల తొలి విడత అభ్యర్థుల జాబితాను ప్రకటించిన మరుక్షణం నుంచి అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ, జనసేన శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నాయకుడు పరుచూరి భాస్కర్‌రావు వర్గీయులైతే పదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తే.. నిన్న కాక మొన్న పార్టీలో చేరిన వారికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని ఆందోళనలు, నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. వీరికి తోడుగా మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కూడా టికెట్ ఆశించారు. టీడీపీ-జనసేన పార్టీల మొదటి జాబితాలో అనూహ్యంగా అనకాపల్లి ఎమ్మెల్యే టికెట్‌ను మాజీ మంత్రి కొణతాలకు ఖరారు చేశారు. దీంతో పీలా, పరుచూరి, దాడి అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు కొణతాలకు మద్దతు ఇస్తామని చెప్పినప్పటికీ.. వారి మదిలో కొణతాలను ఓడించాలనే ఉంది. వ్యతిరేక వర్గంగా ఉన్న పీలా, దాడి వీరభద్రరావులను కొణతాల స్వయంగా కలిసి సయోధ్య కుదుర్చుకున్నారు. అంతేకాకుండా మీడియా ముందు తామంతా కలిసి ఉన్నట్లుగానే చెప్పుకొచ్చారు. ఇదే సరైన సమయంగా భావించిన కొణతాల సోమవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి అందరం కలిసి ఉన్నారనే సంకేతాన్ని కేడర్‌కు అందిద్దామని ఆశించారు. కానీ విస్తృత స్థాయి సమావేశానికి కీలకమైన దాడి వీరభద్రరావు, పరుచూరి భాస్కర్‌రావుతో పాటు వారి వర్గీయులు సైతం రాకపోవడంతో కొణతాల మదిలో ఓటమి భయం పట్టుకుంది. అనకాపల్లి నియోజకవర్గం జనసేన కేడర్ కూడా పూర్తిగా హాజరు కాలేదు.

అలిగిన నాగ జగదీష్

టీడీపీ-జనసేన పార్టీల విస్తృత స్థాయి సమావేశాన్ని పీలా గోవింద సత్యనారాయణతో కలిసి కొణతాల నడిపించడంతో పీలా వ్యతిరేకవర్గ నాయకుడైన బుద్ధ నాగజగదీష్ అలకబూనారు. విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన జగదీష్‌ను, ఆయన వర్గీయులను పట్టించుకోకుండా పీలాకు ప్రాధాన్యం ఇవ్వడంతో చిన్నబుచ్చుకున్నట్టు సమాచారం. మొత్తం మీద అనకాపల్లి నియోజవర్గంలో టీడీపీ-జనసేన పొత్తుతో కేడర్ పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు.

కమనీయం.. రమణీయం





పుష్పాలంకరణలో స్వయంభూ గౌరీశ్వరస్వామి, గౌరీదేవి

- కనులపండువగా పూలంగి సేవ

చోడవరం: అమ్మవారిని, అయ్యవారిని పూలతో అలంకరించారు. ఆ కమనీయ దృశ్యాన్ని కనులారా వీక్షిస్తూ భక్తితో అర్చించారు. స్వయంభూ గౌరీశ్వర స్వామి కల్యాణ శివరాత్రి మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీగౌరీశ్వరస్వామివారిని, పార్వతీదేవిని వివిధ వర్ణాలు, రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి శివలింగానికి వెండి నాగాభరణం అలంకరించారు. మహాలింగంతోపాటు పక్కనే కొలువుదీరిన పార్వతీదేవి విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. ఆలయ అర్చకులు కొడమంచి చలపతి, వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి పూలంగి సేవ నిర్వహించారు.

ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ఉంచి రకరకాల పండ్లు, పూలు, స్వీట్లు పెట్టి స్వామివారికి ఊంజల్ సేవ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ పుష్పాంజలి సేవను కనులారా వీక్షించి తరించారు.

సందడి చేసిన సినీ గాయకుడు కారుణ్య

ముగింపు వేడుకల్లో ప్రముఖ సినీ గాయకుడు కారుణ్య సందడి చేశారు. ఆయన పాటలు పాడి అందర్నీ అలరించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే ధర్మశ్రీ కూడా కొన్ని పాటలు ఆలపించారు. అంతకుముందు కోలాట బృందాల ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పప్పల జయదేవ్, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు స్పందన

- అనకాపల్లి జిల్లాలో 1,283 మంది దరఖాస్తు
- ఈ నెల 25 వరకు గడువు

విశాఖ విద్య : ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సోమవారం వరకు ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 18,231 దరఖాస్తులు అందాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 30, అనకాపల్లి నుంచి 1,283, విశాఖ జిల్లా నుంచి 2,577 మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే విశాఖ జిల్లా నుంచే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గతంలో కంటే ఈ సారి ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించటంతో పాటు, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకునేలా పర్యవేక్షణ చేసేందుకు సమగ్ర శిక్ష ఏపీవో అప్పలనాయుడును నోడల్ అధికారి అధికారిగా నియమించారు. అదే విధంగా మండల స్థాయిలో ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించారు. గడువులోగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా సచివాలయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని డీఈవో చంద్రకళ క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

బ్రిటిష్ సైనికాధికారుల సమాధులను పరిరక్షించండి



ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేస్తున్న పడాల వీరభద్రరావు

నర్సీపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రకు సాక్ష్యంగా నర్సీపట్నంలో ఉన్న బ్రిటిష్ సేనానులు కవర్డ్, హైటర్ సమాధులను పరిరక్షించాలని కోరుతూ జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆర్డీవో హెచ్.వి.జయరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణదారుల వల్ల చరిత్రకు చిహ్నంగా ఉన్న సైనికాధికారుల సమాధులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆర్డీవోకు వివరించారు. తప్పనిసరిగా చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: కస్తూర్బా గాంధీ బాలికల(కేజీబీవీ) విద్యాలయాల్లో 6 నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతుల్లోని ఖాళీలను కూడా భర్తీ చేయనున్నామన్నారు. ఈ నెల 12 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నామని పేర్కొన్నారు. జిల్లాలో(టైప్-3) 20 విద్యాలయాల్లో 1600 సీట్లు ఉన్నట్లు తెలిపారు. అనాథలు, బడి బయట ఉన్న బాలికలు, డ్రాపవుట్లు, దారిద్ర్య రేఖను దిగువన ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, వలస కార్మికుల తల్లిదండ్రుల్లో ఒక్కరే ఉన్న బాలికల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండాలన్నారు. అర్హులైన బాలికలు తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు రేషన్‌కార్డు, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్, బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు ఫోన్ నంబర్‌తో ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దగ్గరలోని కేజీబీవీకి వెళ్లి కూడా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 77298 82022 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

అత్తను హతమార్చిన కోడలు

- రుబ్బురోలుతో తలపై బలంగా మోది హత్య
- ప్రేమ వివాహం కావడంతో తొలి నుంచీ ఇద్దరి మధ్య విభేదాలు



మృతురాలు సింహాద్రమ్మ

అనకాపల్లి: అత్తా కోడళ్ల మధ్య వైరం చివరకు హత్యకు దారి తీసింది. కొడుకు ప్రేమ వివాహం చేసుకున్నాడనే కోపమే అత్తకు శాపంగా మారింది. చిన్నపాటి ఘర్షణ పెద్దదిగా మారి రుబ్బురోలుతో అత్తను కోడలు హతమార్చింది. ఈ ఘటన అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ దేవీనగర్‌లో సోమవారం జరిగింది. స్థానికులు, పట్టణ సీఐ శంకరరావు అందించిన వివరాలు.. దేవీనగర్‌కు చెందిన ఈగల సన్యాసిరావు, ఆయన భార్య ఈగల సింహాద్రమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు గణేష్ తుమ్మపాలకు చెందిన పూర్ణ అనే అమ్మాయితో 2007లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ పెళ్లి ఇష్టం లేని సింహాద్రమ్మకు, ఆమె కోడలికి మధ్య తొలి నుంచీ చిన్నపాటి తగాదాలు, గొడవలు జరుగుతూనే ఉన్నాయి. వారి ఇంటి పక్కనే కొడుకు, కోడలు ఉంటున్నారు. గతంలో వీరిద్దరూ చాలాసార్లు ఘర్షణ పడ్డారు. కేసులు కూడా పెట్టుకున్నారు. అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్‌లో అత్త సింహాద్రమ్మ, కోడలు పూర్ణలకు మూడుసార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిద్దరి మధ్య గొడవ జరిగినప్పుడల్లా స్థానికులు వీరిని వారించేవారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్తాకోడళ్ల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో కోడలు పూర్ణ ఇంట్లో ఉన్న రుబ్బురోలు రాయితో అత్త సింహాద్రమ్మ తలపై బలంగా మోదింది. దీంతో సింహాద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందిందని సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. సంఘటన జరిగిన వెంటనే కోడలు పూర్ణ తుమ్మపాల పుట్టింటికి వెళ్లిపోయింది. మృతురాలి భర్త ఈగల సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పట్టాలపైకి మరో రెండు వందే భారత్ రైళ్లు

- నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభం
- సికింద్రాబాద్-విశాఖ, విశాఖ-భువనేశ్వర్ మధ్య రాకపోకలు
- కొత్తవలస- కోరాపుట్ డబ్లింగ్ పనులు జాతికి అంకితం
- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్ పరిధిలో పలు రైల్వే ప్రాజెక్టులతో పాటు సికింద్రాబాద్-విశాఖపట్నం, విశాఖ-భువనేశ్వర్ మధ్య వందేభారత్ రైళ్లు ప్రారంభం కానున్నాయని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖ-సికింద్రాబాద్ మార్గంలో ఉన్న రైలుకు ఇది అదనంగా ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ రెండు వందేభారత్ రైళ్లతో పాటు, కొత్తవలస-కోరాపుట్ సెక్షన్లు, కోరాపుట్-రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం-టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలు, గూడ్స్ షెడ్, విశాఖ, దువ్వాడ, విజయనగరం స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్ ప్రత్యేక స్టాల్స్‌ని ప్రధాని జాతికి అంకితం చేస్తారని తెలిపారు. 20841/20842 భువనేశ్వర్- విశాఖపట్నం-భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సోమవారం మినహా వారానికి 6 రోజులు పాటు నడిచేలా సర్వీస్ ప్రారంభం కానుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 5.15 గంటలకు విశాఖలో బయలుదేరి అదేరోజు ఉదయం 11 గంలకు భువనేశ్వర్ చేరుకుంటుందనీ.. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్‌లో శనివారం మినహా 6 రోజుల సర్వీసు ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3.30 గంటకు భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖకు రాత్రి 9.30కు చేరుకుంటుందని వివరించారు. ఖుర్దా రోడ్, బల్గావ్, బరంపురం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో నిలుస్తుందని తెలిపారు. 20707/20708 నంబర్‌తో సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం మినహా సర్వీసులుంటాయని తెలిపారు. అయితే ప్రధాని మోదీ ప్రారంభించిన తర్వాత త్వరలోనే రెగ్యులర్ టైమింగ్స్‌ని ప్రకటిస్తామన్నారు.

రైలు కోచ్ రెస్టారెంట్లు

ప్రయాణికులకు ప్రత్యేకమైన భోజన వాతావరణాన్ని అందించడం కోసం, భారతీయ రైల్వే దాని ప్రధాన స్టేషన్లు, పాయింట్లలో రైల్ కోచ్ రెస్టారెంట్‌లను తెరుస్తోందని డీఆర్ఎం తెలిపారు. ఇందులో భాగంగా విజయనగరంలోని ఏర్పాటు చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను కూడా ప్రధాని జాతికి అంకితం చేస్తారన్నారు. అలాగే కొత్తవలస- కోరాపుట్ డబ్లింగ్ పనులు జాతికి అంకితం ఇవ్వనున్నారని పేర్కొన్నారు.

13, 14 తేదీల్లో ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

తుమ్మపాల: ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.ఎస్.శంకర్‌నాయక్ జిల్లాలో ఎస్టీ వసతి గృహాలను సందర్శించనున్నట్లు ట్రైబల్ రైట్స్ ఫోరం చైర్మన్ ఆర్.ఎస్.వరహాలదొర ఒక ప్రకటనలో తెలిపారు. 13న మాడుగుల, వడ్డాది, గోవాడ ఎస్టీ వసతి గృహాలను సందర్శిస్తారని, అదే రోజు మధ్యాహ్నం చోడవరం అంబేడ్కర్ భవనంలో జిల్లా ఉన్నతాధికారులు, గిరిజన సంఘాల నాయకులతో నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కూడా పాల్గొంటారని తెలిపారు. రెండో రోజు 14వ తేదీన రోలుగుంట మండలం చీమలపాడు, ఆర్ల గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశమవుతారన్నారు. రావికమతం మండలం సలిసింగం, లోచింగి గ్రామాలను సందర్శిస్తారని, సాయంత్రం రావికమతం మండల అధికారులు, ఆదివాసీ నాయకులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఉందన్నారు.

రేపు దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13న దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. డి మార్ట్, మ్యాక్స్ ఫ్యాషన్, రాథోడ్‌సన్స్ సంస్థలో 10 చొప్పున, పిజా హట్‌లో 12 చొప్పున కస్టమర్ సర్వీస్ అసోసియేట్ ఉద్యోగాలు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి 18-25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులు. ఆసక్తి గల వారు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఏయూలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9666092491లో సంప్రదించాలని సూచించారు.

పథకాల అమలులో అంకిత భావం అవసరం



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సుజాత

నాతవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలంటే క్షేత్ర స్థాయి సిబ్బంది అంకిత భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ టి.సుజాత అన్నారు. మండల కేంద్రంలో సోమవారం భవన నిర్మాణ కార్మికుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా సోషల్ ఆడిట్ డీఆర్పీ బండారు సూర్యనారాయణ క్షేత్ర స్థాయిలో చేసిన తనిఖీ వివరాలు తెలియజేశారు.

2018-2019 సంవత్సరానికి 64 మంది కార్మికులకు ప్రభుత్వం రూ.14.90 లక్షలు, 2019-2020 గాను 28 మంది కార్మికులకు రూ.5.60 లక్షలు ప్రభుత్వం అందజేసింది. దీనికి సంబంధించి సోషల్ ఆడిట్ క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం ప్రజా వేదిక నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని, అవకతవకలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ శ్రమ పథకంపై క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి పెన్షన్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాగరపు రాంబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఉక్కు మహిళలు



స్టీల్‌ప్లాంట్‌లో నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులు

ఉక్కునగరం: తమకు నూతన వేతనాలు అమలు చేయాలంటూ స్టీల్‌ప్లాంట్ మహిళా కార్మికులు రోడ్డెక్కారు. సోమవారం ఉదయం ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు నిల్చొని నిరసన తెలిపారు. ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు తక్షణమే అమలు చేయాలని, ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ 2007 నుంచి 2019 వరకు జాయిన్ అయిన 3,680 మందికి పైగా ఉన్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నామన్నారు. తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని యాజమాన్యం నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు కార్మిక సంఘాల నాయకులు, యువ కార్మికులు అక్కడకు వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మహిళా కార్మికులు ప్రతిమ, కుమారి, భారతి, దివ్య, వరలక్ష్మి, ఝాన్సీ, దమయంతి, లావణ్య, లీలామణి, హైమావతి, యామిని తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌తో సర్వహక్కులు



ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఉచితంగా స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్వహక్కులు కల్పించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో వేచలం గ్రామానికి చెందిన 20 మందికి ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటి స్థలాలు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ లక్షలాది రూపాయలు విలువ చేసే ఇంటి స్థలాలను కేటాయించి పేదల పక్షపాతిగా సీఎం జగన్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా జగనన్న కాలనీల్లో యజ్ఞంలా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ వేచలపు చిన్నంనాయుడు, పాల సంఘం అధ్యక్షుడు వేచలపు కృష్ణ, వీఆర్‌వో గంగునాయుడు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం మరింత వేగవంతం

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం
- స్పందనకు 246 దరఖాస్తులు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా అధికారులు

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో సమర్పించే అర్జీల పరిష్కారం మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులకు సవివరమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. గ్రామ, మండల స్థాయిలోనే క్షేత్రస్థాయి విచారణ చేసి దరఖాస్తులు, ఫిర్యాదులపై తిరస్కరణ గురించి కారణాలను వివరంగా తెలియజేయాలన్నారు. డీఆర్వో బి.దయానిధి, కెఆర్‌సీసీ ఉప కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, భూసర్వే సహాయ సంచాలకుడు ఎస్.గోపాలరాజ, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 246 దరఖాస్తులు నమోదయ్యాయి.

అనధికారిక గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు

అనధికార గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటూ అనకాపల్లి మండలం బట్లపూడి గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. బట్లపూడి సర్వే నంబర్–1 కొండపై గ్రామానికి చెందిన కొందరు జేసీబీతో రాత్రి వేళ గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లతో విక్రయిస్తున్నారని, మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇదే గ్రామంలో సర్వే నంబర్–1, 33 ప్రభుత్వ భూముల్లో జనసేన పార్టీకి చెందిన వ్యక్తి గ్రావెల్ విక్రయించుకుని ఇంటి స్థలాలుగా లేఅవుట్ వేసి ప్లాట్‌లను విక్రయించారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మరో వర్గం స్పందనలో ఫిర్యాదు చేశారు.

రిక్షా కార్మికులకు భరోసా కల్పించాలి

తమకు ఆర్థిక భరోసా కల్పించాలంటూ అనకాపల్లి రిక్షా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రిక్షా కార్మికులు కలెక్టరేట్ గేటు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన రిక్షా కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక భరోసాగా సంక్షేమ పథకం అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు స్పందనలో విన్నవించుకున్నారు.

కొప్పాక జూనియర్ లైన్‌మన్‌పై ఫిర్యాదు

విద్యుత్ మీటర్ కోసం రూ.11 వేలు లంచం తీసుకుని రోజులు గడుస్తున్నా పని చేయలేదంటూ జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాకకు చెందిన కొండూరు మాధవి.. కొప్పాక జూనియర్ లైన్‌మన్‌పై స్పందనలో ఫిర్యాదు చేశారు. కొప్పాక గ్రామంలో నిర్వహిస్తున్న టీ దుకాణానికి విద్యుత్ మీటర్ అవసరమై లైన్‌మన్‌ను సంప్రదించగా.. లంచడం డిమాండ్ చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

ఇరువాడలో గెడ్డవాగు ఆక్రమణ

జాతీయ రహదారి ఆనుకుని కోట్ల రూపాయలు విలువ చేసే గెడ్డ వాగు ఆక్రమణను అడ్డుకోవాలని సబ్బవరం మండలం ఇరువాడ గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇరువాడ సర్వే నంబర్ 103, 106లో సుమారు మూడెకరాల గెడ్డ వాగును కొందరు ఆక్రమణదారులు జేసీబీలతో చదును చేశారని, రోడ్డు, ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే చర్యలు చేపట్టాలని స్పందనలో కోరారు. అనధికారిక లేఅవుట్ ద్వారా ఇంటి స్థలాల విక్రయించే పనిలో ఉన్నట్లు వారు తెలిపారు.

ఈసీ మంజూరుకు వినతి

ఓటీఎస్ పథకంలో ధ్రువపత్రం పొంది ఉచిత రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో ఈసీ మంజూరు కావడం లేదని గొలగాం గ్రామానికి చెందిన కోరిబిల్లి మాణిక్యం స్పందనలో వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఇప్పటికి ఏడు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు.

పోలీస్ స్పందనకు 28 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లి: ప్రజా సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 28 అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించి నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని సూచించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ కేసులపై అర్జీలను స్వీకరించి అర్జీదారులతో మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడతానని బాధితులకు హామీ ఇచ్చారు.

యలమంచిలి సీటు టీడీపీకి కేటాయించాలి

- ప్రగడను కాదని జనసేనకు ఇస్తే ఒప్పుకోం
- అవసరమైతే చంద్రబాబును కలుద్దాం
- యలమంచిలి టీడీపీ సమావేశంలో తీర్మానం

మునగపాక: యలమంచిలి ఎమ్మెల్యే సీటు విషయంలో అధిష్టానం పునరాలోచించాలని కోరుతూ సోమవారం మునగపాక టీడీపీ నేతలు తీర్మానం చేశారు. టీడీపీ–జనసేన పొత్తులో భాగంగా యలమంచిలి సీటును జనసేనకు కేటాయిస్తున్నట్లు చంద్రబాబు నుంచి వచ్చిన సంకేతాల మేరకు ఇప్పటికే టీడీపీ నేతలు భగ్గుమంటున్న విషయం తెలిసిందే. పార్టీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును కాదని జనసేనకు యలమంచిలి సీటు కేటాయించడం సరికాదంటూ పలువురు నేతలు పార్టీ సమావేశంలో ఏకరువు పెట్టారు. దీనివల్ల వైఎస్సార్‌సీపీ విజయానికి పరోక్షంగా అవకాశం కల్పించినట్లవుతుందని పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయమై పార్టీ సీనియర్ నేతలు పునరాలోచన చేయాలని కోరారు. అవసరమైతే చంద్రబాబును కలిసేందుకు సిద్ధమవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో పేకాట శిబిరంపై దేవరాపల్లి పోలీసులు సోమవారం మెరుపుదాడి చేశారు. ముందస్తు సమాచారంతో స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా.. పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.29,850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీలో టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు భారీగా చేరారు. స్థానిక బొగ్గారపు వీధిలో జీవీఎంసీ 84వ వార్డులో పార్టీ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో వారికి సోమవారం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు పోతిన కల్యాణ్, ఉమ్మి అరుణ, ఆంధ్ర లక్ష్మి, నాగులపల్లి లక్ష్మి, ఎనుగులదేవి, ములంపాక మాధురి, ఎల్లపు ధర్మేంద్ర, చెరుకూరు శ్రీను, కల్యాణ్, నాగేశ్వరరావు, ఆంధ్ర లోకేష్, ఆంధ్ర జగదీష్, రవికుమార్, బల్లంకి గోపి, సీహెచ్.వెంకటేష్, కరకాల సత్తిబాబు, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారు పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కోరుకొండ కన్నబాబు, పార్టీ నేతలు మాధురి నాయుడు, ఏడువాకల నారాయణరావు, కోరుకొండ రమేష్, ఉమ్మడి పైడిరాజు, కేతిరెడ్డి ప్రసాద్, పిల్లల శివ అప్పారావు, పూడి సూరిబాబు, చింతలపూడి వాసు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నక్కపల్లి: రాజయ్యపేటలో భర్త వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఒంటిపై డీజిల్ పోసుకుని సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సీఐ అంబటి విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వాసుపల్లి సింహాచలం అనే మహిళకు అదే గ్రామానికి చెందిన రాజుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతున్నాడు. సోమవారం కూడా మద్యం మత్తులో ఘర్షణకు దిగాడు. తట్టుకోలేని సింహాచలం పక్కనే ఉన్న డీజిల్‌ను శరీరంపై పోసుకుని నిప్పంటించుకుంది. పిల్లలు, చుట్టు పక్కల వాళ్లు చూసి కేకలు వేయడంతో వెంటనే ఆమెను కుటుంబీకులు హుటాహుటిన నక్కపల్లి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రూ.5.75 కోట్లతో పందూరు వంతెన

- పనులకు శంకుస్థాపన చేసిన రాజాం ఎమ్మెల్యే జోగులు
- త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు



పందూరు వంతెనకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జోగులు, ప్రజాప్రతినిధులు

కోటవురట్ల: పందూరు వరాహ నదిపై వంతెన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5.75 కోట్లు మంజూరు చేసిందని ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఈ మేరకు పందూరు వరాహనదిపై వంతెన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని మధ్యలో వదిలేసి చేతులెత్తేసిందని, తమ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. చంద్రబాబు నైజం ప్రజలను మోసం చేయడమేనని, గతంలో ఎన్ని హామీలు ఇచ్చి ఎలా మోసం చేశారో అందరికీ తెలుసన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణాన్ని పిల్లర్ల వరకు మాత్రమే చేపట్టారని, ప్రజల ఇబ్బందిని గుర్తించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ జగనన్నకు మంచి చేయడం ఒక్కటే తెలుసన్నారు. ప్రజలతో రాజకీయం చేయడం జగనన్నకు తెలియదని, ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందించడమే సీఎం ధ్యేయమన్నారు. నవరత్న పథకాల హామీల్లో దాదాపు 99 శాతం పూర్తి చేశారని, ఇంతకు మించి మంచి జరగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్నను ఎదుర్కోలేక దుష్టులంతా ఏకమవుతున్నారని, ప్రజలు గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సభ్యుడు సిద్ధాబత్తుల ఉమాదేవి, ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ చీకట్ల జగదీష్, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, చీకట్ల వెంకట్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం



ఎంసీఎంసీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఆర్‌వో సాయిబాబా

తుమ్మపాల: ఎన్నికల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల పాత్ర కీలకంగా మారిందని డీపీఆర్‌వో డి.సాయిబాబా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా మీడియాలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వార్తలు, వ్యాసాలు, విశ్లేషణలు తమ స్వరూప స్వభావాలను ఆధునికీకరించుకుంటున్నాయన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు, రాజకీయ నాయకుల ఉపన్యాసాలు కొత్త రూపం సంతరించుకుంటున్నాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎంసీఎంసీ టీమ్ మరింత ప్రతిభావంతంగా ఆలోచిస్తూ పెయిడ్ న్యూస్‌లను గుర్తించవలసి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను క్షుణ్ణంగా అవగతం చేసుకొని వార్తా పత్రికలు, వార్తా చానళ్లు, సోషల్ మీడియా మాధ్యమాలు వ్యవహరించాలని సూచించారు. వివిధ పార్టీలకు సంబంధించి అనుకూల, వ్యతిరేకంగా ప్రజల దృష్టిని మళ్లించేలా ఉండే వార్తలను పెయిడ్ న్యూస్‌గా పరిగణించాల్సి ఉంటుందన్నారు. జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి జి.గోవిందరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రకటనలకు ముందస్తు అనుమతి, ఆడిట్ విధి విధానాల గురించి వివరించారు. అనంతరం ఎంసీఎంసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణా కార్యక్రమాల కోఆర్డినేటర్ డీఎం సివిల్ సప్లయీస్ జయంతి, ఎంసీఎంసీ సభ్యులు దామోదరం సంజీవయ్య, న్యాయ కళాశాల రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ టి.వై.నిర్మలాదేవి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కంప్యూటర్ లెక్చరర్ జి.గిరీష్ రెడ్డి, డీఐపీఆర్‌వో కె.ఇంద్రావతి, డీఎల్‌డీవో నాగమణి, ఎల్‌డీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి : సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. నెహ్రూచౌక్‌లో సోమవారం ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలన్న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందన్నారు. గడువు ముగుస్తున్న సమయంలో మరో 116 రోజులు అదనపు గడువు కావాలని ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించిందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బీఐ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన ఎస్‌బీఐ అందజేసేలా సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరాం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, నాయకులు బి.ఉమా మహేశ్వరరావు, కె.తెల్లయ్యబాబు, కె.ఈశ్వరరావు, ఎస్.రమణ, నూక అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నేడు

అనకాపల్లి : స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బి.వి.సత్యవతి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు ఆయన పేర్కొన్నారు. జోన్ పరిధిలో కార్పొరేటర్లు, వివిధ దేవస్థానాల చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ అనుబంధ సంస్థల కమిటీ నాయకులు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావలసిందిగా ఆయన కోరారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తెలిపారు. 13 ఏళ్లుగా ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని పేదవాడి పక్షాన అండగా నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. 14 ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఎస్.రాయవరం వైఎస్సార్ విగ్రహం వద్ద ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న యాదవ సంక్షేమ సంఘ నేతలు

మునగపాక: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటామని యాదవ సంక్షేమ సంఘ నేతలు స్పష్టం చేశారు. మండలంలోని నారాయుడుపాలెం గ్రామంలో ఇటీవల పూరిళ్లు అగ్నికి ఆహుతికావడంతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు సోమవారం అనకాపల్లి జిల్లా యాదవ సంఘం ద్వారా రూ.10వేలను బాధితులు రవితేజ, సన్యాసమ్మలకు సాయంగా అందజేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సంఘ జిల్లా అధ్యక్షుడు బర్నికాన రామారావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, సంఘ గౌరవ అధ్యక్షులు బర్నికాన నరసింహమూర్తి, సంఘ నాయకులు బోరా సోమునాయుడు, మొల్లి ప్రసాద్, బందం వెంకటరమణ, కొయ్య రాజు, కారుకొండ అప్పలరాజు, పల్లా సన్యాసిరావు , చినపైడయ్య పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 9,976 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,740	4,300
మొదటి రకం	3,600	4,260
రెండో రకం	3,390	3,770
మూడో రకం	3,300	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్ : రాజా
గామి : సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు : సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్ : షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన: పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్ : వెంకటేశ్వర
రికార్డుబ్రేక్ : శ్రీసత్య
భీమా : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-43 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబర్‌ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 453 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

దోనె కష్టాలు తీరినట్టే..!

- సీఎం హామీతో వెల్లివిరిసిన ఆశలు
- గవరపేటలో శారదానదిపై వంతెనకు రూ.3 కోట్లు మంజూరుకు సీఎం హామీ
- ఆనందం వ్యక్తం చేసిన రైతులు

కశింకోట : కశింకోటలోని గవరపేటలో శారదానదిపై వంతెన నిర్మాణానికి మహర్దశ పట్టింది. నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉన్న వంతెన పూర్తి చేయడానికి రూ.3 కోట్లు మంజూరు చేయనున్నట్టు ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మాట ఇచ్చారంటే అది ఆచరణలో అమలు జరిగి తీరుతుందన్న సంగతి తెలిసిందే. ఇక్కడి వంతెన నిర్మాణం కూడా పూర్తి కాగలదని, దీర్ఘ కాలంగా పడుతున్న కష్టాలు తొలగిపోగలవని ఈ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గవరపేట ప్రాంతంలో అత్యధిక శాతం మంది రైతుల పొలాలు, పశువుల పాకలు శారదానది అవతల ఉన్నాయి. వ్యవసాయ కార్యకలాపాలు సాగించడానికి, పశువుల పోషణ, పాల సేకరణకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇందుకు ఇక్కడ శారదా నదిని దాటాల్సి ఉంటుంది. నదిపై రాకపోకలకు తాటి దోనెలను వినియోగిస్తుంటారు. ఇవి ఒక్కోసారి మునిగి రైతులు మృత్యువాత పడిన సంఘటనలు గతంలో ఉన్నాయి. నదిలో నీటి ఉధృతి ఎక్కువయితే దోనెలు కూడా నడపడానికి వీలుండదు. దీంతో గ్రామ శివారున ఉన్న వెదురుపర్తి వంతెన మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం వరకు నడిచి పొలాలు, పశువుల పాకలకు చేరుకొని వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గతంలో పలువురు నాయకులు, అధికారులు వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎమ్మెల్యేగా ఉండగా రూ.3 కోట్ల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణానికి 2020 జనవరి 9న అప్పటి రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాసు శంకుస్థాపన చేశారు. అనంతరం వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. కాంక్రీట్ స్తంభాలు నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నదిలో నీరు రావడం, కరోనా తదితర కారణాల వల్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి తన ఎంపీ నిధులతో పూర్తి చేయడానికి గత ఏడాది కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరుతూ విన్నవించి ప్రయత్నించారు.

ముఖ్యమంత్రి తక్షణ స్పందన

ఇటీవల ఇక్కడి సమీపంలోని పిసినికాడలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆర్థిక సహాయం అందించడానికి నిర్వహించిన బహిరంగ సభకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఇక్కడి వంతెన సమస్యను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీసుకు వచ్చి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి వంతెన నిర్మాణం పూర్తి కావడానికి అవసరమైన రూ.3 కోట్ల నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. మాట తప్పని ముఖ్యమంత్రిగా పేరొందిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారంటే అది తప్పక నెరవేరి తీరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కశింకోటలోని గవరపేట ప్రాంతంలో దోనెలపై నదిని దాటుతున్న రైతులు

సీఎం హామీ హర్షణీయం



శారదానదిపై గవరపేట వద్ద వంతెన నిర్మాణం పూర్తి కావడానికి రూ. 3 కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం ఆనందంగా ఉంది. వంతెన నిర్మాణం పూర్తి అయితే ఇకనైనా నదిపై రాకపోకలు సాగించడానికి పడుతున్న కష్టాలు తొలగిపోగలవు.

– సూరిశెట్టి ఆదిబాబు, రైతు, కశింకోట

రైతుల కష్టాలు తీరతాయి..



పొలాలకు వెళ్లడానికి దోనెలపై నదిని దాటుతుంటాం. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ అవసరమైన వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరుకు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. వంతెన నిర్మాణం పూర్తి అయితే ఇక రైతుల కష్టాలు తీరగలవు.

–పెంటకోట వెంకట రమణ, రైతు, కశింకోట

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



శారదానదిపై వంతెన నిర్మాణానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విన్నవించిన మేరకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పిసినికాడలో జరిగిన బహిరంగ సభలో రూ.3 కోట్లు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–మళ్ల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

ఎస్‌బీఐ వద్ద సీపీఎం, సిటూ ఆందోళన

కశింకోట : కశింకోట ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర వ్యాపిత పిలుపు మేరకు సీఎంఎం, సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొందన్నారు. మార్చి 6లోగా బాండ్ల కొనుగోలు, అమ్మకాల వివరాలు ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్దేశించిందని, అయితే వివరాలు ఇవ్వడానికి ఎస్‌బీఐలు సాకులు చూపుతుండడం శోచనీయమన్నారు. నిర్దేశించిన వ్యవధిలో బాండ్ల వివరాలు ఎన్నికల కమిషన్‌కు అందించి బ్యాంకులు తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు వరలక్ష్మి, సీపీఎం ప్రతినిధులు నాగమణి, శ్రీదేవి, అమ్మాజి పాల్గొన్నారు.

'వందే భారత్'కు అనకాపల్లిలో హాల్ట్‌కు వినతి

అనకాపల్లి: విశాఖ నుంచి సికింద్రాబాద్ మధ్య మరో వందే భారత్ రైలును ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనుండడం చాలా ఆనందంగా ఉందని ఎంపీ బీవీ సత్యవతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలుకు హాల్ట్ కల్పించాలంటూ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్‌తో పాటు రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మసిన్హాకు లేఖ పంపినట్లు ఆమె పేర్కొన్నారు.

'ఎన్నికలకు మేం సిద్ధం... మా బూత్ సిద్ధం'

కశింకోట : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయం చేకూర్చాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. మండలంలోని తాళ్లపాలెం, బంగారయ్యపేట, సింగవరం, అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో సోమవారం పర్యటించి 'మేం సిద్ధం- మా బూత్ సిద్ధం' పేరిట పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి స్థానిక పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీకి విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట్, నిమ్మదల సోమేష్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మిస్కా రమణ, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, గోకివాడ గోవింద, రమణ, ఇందలి ముసిలినాయుడు, గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.



తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో మేం సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నేడు పలు గ్రామాల్లో 'మేం సిద్ధం..మా బూత్ సిద్ధం'

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం 'మేం సిద్ధం–మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడానికి నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జోగారావుపేట, తేగాడ గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆయా గ్రామాల్లోని స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొవాలని కోరారు.

వారపు సంతలో తగ్గిన సందడి



తాళ్లపాలెం వారపు సంతలో మేకలు, గొర్రెల అమ్మకాలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో మేకలు, గొర్రెల అమ్మకానికి సోమవారం తక్కువ సంఖ్యలో వచ్చాయి. చుట్టు పక్కల ప్రాంతాల్లో కొద్ది రోజులుగా పండగలు ఉండడంతో వాటి హడావిడిలో నిమగ్నం కావడం వల్ల ఉభయ విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువమంది పెంపకందారులు, అమ్మకందారులు వీటిని తీసుకు వచ్చారు. అయితే అమ్మకాలు యథావిధిగా సాగాయి. ఒక్కొక్కటి పరిమాణాన్ని అనుసరించి రూ.5 వేల నుంచి రూ.22 వేల వరకు అమ్మకాలు సాగాయి. వీటిని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు వచ్చి కొనుగోలు చేసి ఆటోలు, వ్యాన్లలో తమ ప్రాంతాలకు తరలించారు.

బాల్య వివాహాల నియంత్రణకు కఠిన చర్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న సన్యాసిరాజు

అనకాపల్లి: బాల్య వివాహాలు నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తున్నాయని సీడ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కార్యదర్శి వి.సన్యాసిరాజు అన్నారు. మండలంలో పిసినికాడ సీడ్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల వరకు ఉచిత విద్య, 2030 నాటికి బాల్య వివాహాలను ముగించే విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని రాజకీయ పార్టీలను ఎన్జీవో కోరిందన్నారు. విద్య, బాల్య వివాహాల 18 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య బాల్య వివాహాలను అంతం చేసేందుకు సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా దేశం చేస్తున్న పోరాటంలో భాగంగా బాల్య వివాహాలను అంతం చేసి, 2030 నాటికి ఈ నేరాన్ని ముగించే సంస్థ అడుగులు వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కో ఆర్డినేటర్లు డేవిడ్‌రాజు, చిన్నారావు పాల్గొన్నారు.

ఆవ ఖండం ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ప్రధాన కేంద్రంలో సౌత్-2 రెవెన్యూ పరిధిలో పచ్చని పంట పొలాలను విచ్ఛిన్నం చేసి అక్రమ లేఅవుట్ నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అత్యంత దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. సీపీఐ బృందం గురువారం ఆవఖండంలో నిర్మిస్తున్న అక్రమ లే అవుట్లను సోమవారం పరిశీలించింది. పచ్చని పంటలతో కలకలలాడే ఆవ ఖండాన్ని రియల్ దందా పేరుతో విధ్వంసం చేస్తున్నారని బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవఖండం భూములను సుమారు పది అడుగులపైనే గ్రావెల్‌తో ఎత్తు చేసి భారీస్థాయిలో రోడ్లు నిర్మించి వెంచర్ కోసం అభివృద్ధి చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న లేఅవుట్లపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఎటువంటి అనుమతులు లేని అక్రమ లే అవుట్ పనులు నిలుపుదల చేయాలని అధికారులను కోరారు. నీటిపారుదల శాఖ, రెవిన్యూ, జీవీఎంసీ అధికారులు లే అవుట్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, లేకుంటే ప్రజలు, అఖిలపక్ష రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం, కోరుబిల్లి శంకరరావు, తాకాసి వెంకటేశ్వరరావు, ఎం. చిన్ని, చిరంజీవి పాల్గొన్నారు



ఆవఖండం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ బృందం

బాడీ బిల్డింగ్‌లో మారునాయుడు సత్తా

అనకాపల్లి: సౌతిండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన ఎస్.ఎం.మారునాయుడు 80 కేజీ విభాగంలో సత్తా చాటాడు. ప్రథమ బహుమతితో పాటు రూ.15వేలు దక్కించుకోవడంతో పాటు రూ.50 వేలు క్యాష్ అవార్డుతో ఓవరాల్ రన్నర్‌గా నిలిచాడు. ఈ నెల 9, 10 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం దావనగెరే పట్టణంలో ఇండియన్ బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన డ్రీమ్స్ క్లాసిక్ బాడీబిల్డింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి మారునాయుడు పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే ఈ నెల 16, 17 తేదీల్లో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్న మారునాయుడిని స్థానిక బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ, కార్యదర్శి శిలపరశెట్టి బాబీ సోమవారం అభినందించారు.



ట్రోఫీతో మారునాయుడు

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎంపీ సత్యవతి

అనకాపల్లి : మహిళలకు సమాన హక్కు కల్పించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. పెంటకోట కన్వెన్షన్‌లో సోమవారం వాసవీ క్లబ్ వనిత ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక సంక్షేమ పథకాలు ప్రధాని మోదీ, సీఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఒక మహిళగా, ఒక డాక్టర్‌గా మహిళలకు ఏమి కావాలో తనకు తెలుసన్నారు. గత ఐదేళ్లుగా ఆ విధంగా తాను కృషి చేశానని తెలిపారు. మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే దేశానికి అసలైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుందన్నారు. వాసవీ క్లబ్ వనిత అధ్యక్షురాలు జంగాల ఫణిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంపీతో పాటు మరో ముఖ్య అతిథులు మలసాల భరత్ కుమార్ దంపతులను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖ రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పాలకుర్తి గాయత్రి, వాసవీ క్లబ్ గవర్నర్ వై.నర్సింగరావు, కార్యదర్శి గుర్రం సువర్ణ, కోశాధికారి దాసరి సునీత, ప్రోగ్రాం చైర్‌పర్సన్, జిల్లా కేబినెట్ కోశాధికారి కొల్లూరు పూర్ణిమ, పుట్ట పద్మజ, ఉప్పల శ్యామల, వాసవి క్లబ్ వనిత సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

ప్రజల కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

అచ్యుతాపురం : ప్రజల కనీస అవసరాలు తీర్చడమే తమ లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు అన్నారు. అచ్యుతాపురం, మునగపాక, కశింకోట మండలాల సరిహద్దులను కలుపుతూ నిర్మించిన తారురోడ్డులో భాగంగా అవసరమైన మూడు చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి ఆయన ఎంపీ సత్యవతితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం మండలం పరిధిలో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.3.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఎంపీ సత్యవతి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, మునగపాక జెడ్పీటీసీ సోము సత్యనారాయణ, మునగపాక ఎంపీపీ జయలక్ష్మి పాల్గొన్నారు.



బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

సీతారాముల విగ్రహాల ఏర్పాటుకు విరాళం

రాంబిల్లి: మామిడివాడ శివా రు కలవలపల్లి గ్రామంలో సీతారాముల విగ్రహాల ఏర్పాటు కోసం బ్రాండిక్స్ ఇండియన్ పార్టనర్ దొరైస్వామి రూ.1.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయ న సోమవారం చెక్కును సర్పంచ్ ఎం.అప్పలనర్స, గ్రామ వైఎస్సార్‌సీపీ నేత ఎస్.సన్యాసిరావుకు అందించారు. గ్రామాల్లో ఐక్యత, ఆధ్యాత్మికత విరజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి.భాస్కరరావు, చినమ్మలు, మహాలక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రోజువారీ ఆశీలు వేలం పాట

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామ పంచాయితీలో రోజువారీ ఆశీలు వేలం పాట నిర్వహించడం జరిగిందని ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. రోజువారీ ఆశీలు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.6.82 లక్షలు కాగా తునికి చెందిన ఇరిగిరి శ్రీలేఖ రూ.6.65 లక్షలకు పాడినట్టు తెలిపారు. నిర్ధారించిన రేటు కన్నా తక్కువ పాట పాడడంతో జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మేకల కమేశా రూ.50 వేలకు వెళ్ళిందన్నారు. చేపల మార్కెట్, చెట్లు ఫల సాయం వేలం పాటను వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ వేలం పాటలో పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు ఇలా..

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. టామాటా రూ.20, ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, క్యాబేజి రూ.30, వంకాయ, దొండకాయ, చిలకడదుంప రూ.40, బెండకాయ, బరబాటి, బీట్రూట్, క్యారెట్, చేమదుంప, కాకరకాయ రూ.60, బీరకాయ, చిక్కుడుకాయ, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల బైక్ ర్యాలీ

అనకాపల్లి: అగ్రిగోల్డ్ బాధితులకు హామీ మేరకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపు అగ్రిగోల్డ్ బాధితులు అందరికి డిపాజిట్లు తిరిగి చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ బైక్ ర్యాలీలో బాధితులందరూ పాల్గొవాలని ఆయన పిలుపునిచ్చారు.

హెచ్‌ఐవీ, టీబీపై అవగాహన

పాయకరావుపేట : గుంటపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు వి.ఎస్ సౌందర్య, వైద్య సిబ్బంది 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీం డిఆర్ పి గోవిందరావు, ప్రతినిధి జి.హెచ్.నర్సింగరావు, డిస్ట్రిక్ట్ రిసోర్సు పర్సన్ గోవిందరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు పందూరుపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థం మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. సోమవారం ఈ పోటీలను గ్రామ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పందూరి సరువునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కొత్తూరు

రేఖా నెం. 01/2024 తేది: 11-03-2024

టెండరు నోటీసు

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలము, కొత్తూరు గ్రామ పంచాయతీకి చెందిన 2024-2025 సం. **తే॥ 01.04.2024ది** నుండి **తే॥ 31.03.2025ది** సంవత్సరమునకు సంబంధించిన షెడ్యూల్ I నందు పేర్కొన్న ఐటం సప్లయ్ చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు **తే॥ 15.03.2024ది, శుక్రవారం ఉదయం 11:00 గం॥ల** నుండి **మధ్యాహ్నం 2.00 గంటలు వరకు** టెండర్లు స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 3.00 గం॥లకు** హాజరైన టెండరుదారుల సమక్షమున తెరువబడును. టెండరుదారులు ఈ దిగువ పేర్కొన్న ప్రకారం ధరావత్తు పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, కొత్తూరు వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ (DD) నేషనలైజ్డ్ బ్యాంకు నుండి తీసుకొని టెండర్లుతోపాటు జతపర్చి టెండర్లు దాఖలు చేయవలెను.

షెడ్యూల్ -1 తేది: 15.03.2024 శుక్రవారం

వ. నెం.	సప్లయి వివరములు 2024-2025 (తే॥ 01.04.2024ది నుండి తే॥ 31.03.2025ది వరకు)	ధరావత్తులు రూ. లలో
1.	2024-2025 సం॥నకు పారిశుధ్య పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు 17 మంది పనివారలను సప్లై చేయుటకు మనిషి ఒక్కింటికి రేటు తెల్పవలెను. కాంట్రాక్టు లేబరు పనిచేయని దినములకు వేతనం చెల్లింపబడదు. (పని సమయములో జరుగు ప్రమాదములకు పంచాయతీ బాధ్యత వహించదు)	10,000/-
2.	మంచినీటి సరఫరా పనులకు ముగ్గురు (3) అనుభవము గల పనివారల సప్లయి చేయుటకు. (పని సమయములో జరుగు ప్రమాదములకు పంచాయతీ బాధ్యత వహించదు)	5,000/-
3.	గ్రామ పంచాయతీ పరిధిలో వీధి దీపములు రిపేర్ పనులకు ఇద్దరు (2) అనుభవము గల పనివారల సప్లయి చేయుటకు. (పని సమయములో జరుగు ప్రమాదములకు పంచాయతీ బాధ్యత వహించదు)	2,000/-
4.	గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తల ట్రాక్టరు డ్రైవరును ఒక్కరిని (1) అనుభవము గల పనివారల సప్లయి చేయుటకు. (పని సమయములో జరుగు ప్రమాదములకు పంచాయతీ బాధ్యత వహించదు)	5,000/-
5.	గ్రామ పంచాయతీకి అవసరమైన లిస్ట్ దాఖలా ప్రజారోగ్య మందులు మరియు పారిశుద్ధ్య సామాగ్రి సప్లయ్ చేయుటకు (అథరైజ్డ్ డీలర్లు మాత్రమే టెండరు వేయుటకు అర్హులు). (పని సమయములో జరుగు ప్రమాదములకు పంచాయతీ బాధ్యత వహించదు)	5,000/-

షరతులు :

I. షెడ్యూల్ 1 లో పాల్గొను పాటదారులు టెండరుదారులు తప్పనిసరిగా నేషనలైజ్డ్ బ్యాంకు నుండి డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించవలెను.
II. షెడ్యూల్ 1 లో చూపబడిన టెండర్లు ఏ కారణం చూపకనే వాయిదా వేయుటకు, రద్దుపరచుటకు ఈ క్రింది సంతకందారునికి పూర్తి అధికారం కలదు.

సం/- కె.శ్రీనివాసరావు
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, కొత్తూరు